క్లుప్తంగా

ఆహార సామగ్రి సరఫరా టెండరు ఖరారు



టెండర్లు ఖరారు చేస్తున్న ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఆర్.వైశాలి

పార్వతీపురంటౌన్: పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, గిరిజన వసతి గృహాలు, గురుకులం రెసిడెన్షియల్ పాఠశాలలకు ఆహార సామగ్రి, సౌందర్య సాధనాల కొనుగోలుకు సంబంధించి టెండర్ల ప్రక్రియ ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఆర్.వైశాలి సమక్షంలో బుధవారం గిరిమిత్ర హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా టెండర్లను తెరచి అతి తక్కువ ధరకు ఖరారు చేశారు. టెండర్ ఖరారైన బిడ్డర్ మూడు మాసాల పాటు సరఫరా చేయాల్సి ఉంటుందని ఆమె తెలిపారు. ఈ ప్రక్రియలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకురాలు ఆర్.కృష్ణవేణి, జీసీసీ డీఎం, ఐటీడీఏ పరిపాలన అధికారి, ప్రిన్సిపాల్స్, వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.

తట్టికోట వీధిలో ఘనంగా లక్ష్మీగణపతి హోమం



నిర్వహిస్తున్న లక్ష్మీగణపతి హోమం

సాలూరు: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని తట్టికోట వీధిలో ఘనంగా లక్ష్మీగణపతి హోమం బుధవారం నిర్వహించారు. పండితుడు రఘుశర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ వినాయక విగ్రహం కాణిపాక గణపతిలా ఉండడం ప్రత్యేకం. లోకకల్యాణార్థం, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఈ పూజలు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సీఐ బాధ్యతల స్వీకరణ



పార్వతీపురం రూరల్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన రంగనాథం

పార్వతీపురం రూరల్: ఇటీవల పోలీస్ శాఖలో జరిగిన బదిలీల్లో పార్వతీపురం రూరల్ సీఐగా రంగనాథం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎస్పీ కార్యాలయంలో ఎస్బీ సీఐగా విధులు నిర్వహించిన ఆయనను పార్వతీపురం రూరల్ సీఐగా బదిలీ చేస్తూ గత నెల 29న విశాఖ రేంజ్ డీఐజీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు రావడంతో ఈ మేరకు బుధవారం ఆయన స్థానిక రూరల్ సర్కిల్ పోలీస్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో రంగనాథం పార్వతీపురం పట్టణ ఎస్సైగా విధులు నిర్వహించారు.

చెరువును తలపిస్తున్న జూనియర్ కళాశాల



వర్షపు నీటిలో పాచిపెంట జూనియర్ కళాశాల

పాచిపెంట: మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి జూనియర్ కళాశాల పూర్తిగా జలమయమై చెరువును తలపిస్తోంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు నీటి మధ్య నుంచి క్లాస్ రూమ్‌లోకి వెళ్తున్నారు.

వినాయక నిమజ్జనంలో బాధ్యత కమిటీ సభ్యులదే

సాలూరు: వినాయకనిమజ్జనంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా పూర్తిబాధ్యత కమిటీ సభ్యులే వహించాలని పట్టణ సీఐ అప్పలనాయుడు స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ,ఈ నెల 6వ తేదీలోపు వినాయక నిమజ్జనాలు పూర్తిచేయాలని కమిటీ సభ్యులందరికీ సూచించామన్నారు. నిమజ్జన ప్రాంతం, ఊరేగింపు చేసే దారులు, సమయం ముందుగానే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఊరేగింపు సమయంలో డీజేలు, అశ్లీలనృత్యాలకు అనుమతులు లేవని, బాణసంచా, పేలుడు పదార్థాలు నిషేధమని తెలిపారు. నిమజ్జన సమయంలో డ్రోన్లు, సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఊరేగింపు సమయంలో వీధుల్లో నృత్యప్రదర్శనలు, బళ్ల వేషాలు చేసుకుని వీధి దాటిన వెంటనే ఎక్కడా ఆగకుండా నేరుగా నిమజ్జన స్థలానికి చేరుకుని వినాయక నిమజ్జనం చేయాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే వినాయక కమిటీ సభ్యులు పూర్తి బాధ్యులవుతారని స్పష్టంచేశారు.

మాజీ సర్పంచ్ మృతి

మక్కువ: మండలంలోని దేవరశిర్లాం పంచాయతీ మాజీ సర్పంచ్ గేదెల జగన్నాథం నాయుడు(65) బుధవారం అనారోగ్యంతో మృతిచెందారు. జగన్నాథంనాయుడు అనారోగ్యంతో బాధపడుతుండడంతో, కుటుంబసభ్యులు విశాఖపట్నంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యచికిత్స అందించినప్పటికీ బుధవారం ఉదయం ఆయన మృతిచెందారు. జగన్నాథంనాయుడి మృతి విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు గ్రామానికి చేరుకుని భౌతికకాయాన్ని సందర్శించారు.

పొంగుతున్న కొండవాగులు

- గంటల కొద్దీ రాకపోకలకు అంతరాయం
- వంతెన నిర్మాణాలు చేపట్టాలని కోరుతున్న గిరిజన ప్రజలు



సాలూరు, పాచిపెంట మధ్య అమ్మవలస సమీపంలో కారిగెడ్డ

పాచిపెంట: ఇటీవల కురుస్తున్న వర్షాలకు పాచిపెంట మండలంలోని కొండవాగులు పొంగి పొర్లుతున్నాయి. వాగులు ఉధృతంగా ప్రవహించే సమయాల్లో గిరిజన ప్రాంతాలకు రాకపోకలు గంటల కొద్దీ నిలిచిపోతున్నాయి. మధ్యాహ్నం, సాయంత్రం, సమయాల్లో వర్షం కురిస్తే ఆ ప్రాంతాల్లో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులు వారి సొంత ఇళ్లకు సకాలంలో చేరుకునే పరిస్థితి లేదు. ఒక్కోసారి చేసేదేమీ లేక వారు ఉద్యోగం చేస్తే చోటే బస చేయాల్సిన పరిస్థితి. అత్యవసర సమయాల్లో గ్రామాల్లోకి 108 వాహనాలు కూడా వెళ్లే పరిస్థితి లేదు. ఆ సమయాల్లో ప్రజలు పడే ఇబ్బందులు మాటల్లో చెప్పలేనివి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తానని స్థానిక శాసన సభ్యురాలు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి వెల్లడించినప్పటికీ అవి మాటలు గానే మిగిలిపోతున్నాయి. కానీ చేతల రూపంలో ఎక్కడా కనిపించడం లేదని గిరిజన ప్రజలు, స్థానిక గిరిజన సర్పంచ్‌లు వాపోతున్నారు.

అమ్మవలస సమీపంలో కారిగెడ్డ

సాలూరు, పాచిపెంట మార్గం మధ్యలో అమ్మవలస సమీపంలో కారి గెడ్డ ఉంది. అమ్మ వలస సమీపంలో నాగలిగెడ్డ, కారి గెడ్డ కొండ వాగులు ఒకే చోట కలుస్తాయి, కాబట్టి చిన్నపాటి వర్షం కురిసినా ఈ గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తుంది. గతంలో ఇక్కడ చప్టా నిర్మాణం చేపట్టినప్పటికీ పెద్ద పెద్ద బండరాళ్లతో కన్నాలు మూసుకుపోవడం వల్ల చప్టాపై నుంచి నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. ఆ సమయాల్లో పాచిపెంట సాలూరు మధ్య రాకపోకలు కొన్ని గంటలు పాటు పూర్తిగా నిలిచిపోతాయి, గతంలో ఇద్దరు వ్యక్తులు ఈ గెడ్డలో గల్లంతై మృతి చెందారు. దీంతో పోలీసువారు హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేశారు.

కుమ్మరి వాగు

పాచిపెంట మండల కేంద్రాన్ని ఆనుకుని కుమ్మరివాగు ప్రవహిస్తూ ఉంటుంది. మండల కేంద్రం నుంచి, పద్మాపురం, పెద్దవలస, కేసలి తదితర పంచాయతీలకు చెందిన సుమారు 30 గిరిజన గ్రామాల ప్రజలు ఈ వాగు మీదగా రాకపోకలు సాగిస్తారు, సరస్వతి శిశు మందిర్, సమతా పబ్లిక్ స్కూల్ అటువైపు ఉండడంతో, ఈ వాగు ఉధృతంగా ప్రవహించే సమయంలో పాఠశాలలకు వెళ్లేందుకు పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి. మంగళవారం సాయంత్రం కురిసిన వర్షానికి ఈ వాగు ఉధృతంగా ప్రవహించడంతో, ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోవడంతో పాటు స్కూల్ పిల్లలు సుమారు రాత్రి 10 గంటల వరకు పాఠశాలలోనే ఉండిపోవాల్సి వచ్చింది.



పాచిపెంట మండల కేంద్రం సమీపంలో కుమ్మరి వాగు

ఉధృతంగా ప్రవహిస్తున్న వేటగాని వలస వాగు

మండలంలోని వేటగాని సమీపంలో ఉన్న వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. గొట్టూరు, శతాబి, తంగ్లం, మూటకూడు, గడిసిగుడ్డి, తదితర గిరిజన పంచాయతీలకు చెందిన ప్రజలు ఈ వాగు మీదుగా రాకపోకలు సాగించాలి, మంగళవారం సాయంత్రం కురిసిన వర్షానికి ఈ వాగు ఉధృతంగా ప్రవహించడంతో, సుమారు 5 గంటల పాటు ఆయా..పంచాయతీలకు చెందిన గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.

వంతెన నిర్మాణం చేపట్టాలి

వేటగాని వలస సమీపంలో ఉన్న వాగుపై వంతెన నిర్మాణం చేపట్టాలి, వర్షాలు పడే సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం, అత్యవసర పరిస్థితుల్లో మేం పడే బాధలు మాటల్లో చెప్పలేనివి. గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి స్పందించి వంతెన నిర్మాణం చేపట్టాలి.

–మాదల సింహాచలం, గిరిజన సర్పంచ్, గొట్టూరు

అంగన్వాడీలతో చర్చలు సఫలం

పార్వతీపురం రూరల్: ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పార్వతీపురం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే దీక్షలు తాత్కాలికంగా విరమిస్తున్నట్లు యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు ఎం.ఉమామహేశ్వరి తెలిపారు. బుధవారంతో మూడో రోజుకు చేరిన దీక్షల సందర్భంగా మంగళవారం సాయంత్రం పీడీ, పది ప్రాజెక్టుల సీడీపీఓలు, సూపరింటెండెంట్లు, యూనియన్ ప్రాజెక్ట్ నాయకులతో జరిపిన చర్చలను ఆమె తెలియజేశారు. ఈ సందర్భంగా ఎం.ఉమామహేశ్వరి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏడు ప్రమోషన్లకు గాను మూడు ప్రమోషన్లను వెంటనే అమలు చేయడానికి అధికారులు ఉత్తర్వులు జారీ చేశారని, మిగిలిన నాలుగు ప్రమోషన్లను త్వరలో అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. దీనికి జిల్లా కమిటీ అంగీకరిస్తూ ఒప్పందం జరిగిందని తెలిపారు. ఇది అంగన్వాడీల పోరాట విజయమని, భవిష్యత్తు పోరాటాలకు కదిలి రావాలని అంగన్వాడీలకు పిలుపునిచ్చారు. మిగిలిన నాలుగు పోస్టులకు వెంటనే ప్రమోషన్ ఉత్తర్వులు జారీ చేయాలని, లేకుంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపట్ల జాగ్రత్తలు తీసుకోవాలి



రోగులను తనిఖీ చేస్తున్న డాక్టర్ పి రమ్యసాయి

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో ప్రజలకు సోకుతున్న సీజనల్ వ్యాధులపట్ల ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని పెదంకలాం పీహెచ్‌సీ డాక్టర్ పెద్దింటి రమ్యసాయి అన్నారు. ఈ మేరకు పెదంకలాం పీహెచ్‌సీ పరిధిలో ఉన్న నీలకంఠాపురంలో ఉచితవైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమ్యసాయి మాట్లాడుతూ గ్రామాల్లో వర్షాలు కురుస్తున్న కారణంగా సీజనల్ జ్వరాలు వస్తున్నట్లు గుర్తించామన్నారు. ఈ నేపథ్యంలో ఉచితవైద్య శిబిరం నిర్వహించి 30 మందికి వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధుల నివారణకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కాచి చల్లార్చిన నీరుతాగాలని, జలుబు, జ్వరం, దగ్గు తదితర ఆరోగ్యపరమైన సమస్యలుంటే అందుబాటులో ఉన్న వైద్యసిబ్బంది నుంచి వైద్యసేవలు పొందాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ జి సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజ



పెదమరికిలో కుంకుమార్చన చేస్తున్న భక్తులు



సంగంవలసలో అన్నసంతర్పణలో పాల్గొన్న భక్తులు

పార్వతీపురం రూరల్: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా 8వ రోజున పార్వతీపురం మండలంలోని పలు వినాయక చవితి మంటపాల వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు. మండలంలోని సంగంవలస గ్రామంలో కూరాకుల వీధిలో ఏర్పాటుచేసిన వరసిద్ధి వినాయక మంటపం వద్ద బుధవారం అన్న సంతర్పణ కార్యక్రమాన్ని కమిటీ సభ్యులు నిర్వహించి గ్రామస్తులకు అన్న ప్రసాదాలను వండివడ్డించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులంతా పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. అలాగే పెదమరికి గ్రామంలో ఏర్పాటు చేసిన శివుని కుమారుని అవతారంలో ఉన్న విఘ్నేశ్వరుడి వద్ద కుంకుమ పూజలు నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పార్వతీపురం టౌన్: విద్యుత్ సరఫరాలో గురువారం అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గోపాల్ రావు నాయుడు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 33/11కేవీ సబ్ స్టేషన్ పరిధిలో 8 మెగావాట్ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఎరెక్షన్ వర్క్ జరగుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు పార్వతీపురం సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న బెలగాం, చర్చి వీధి, బంగారమ్మ కాలనీ, బైపాస్ రోడ్, గోపాల్ దాస్ పేట, మెయిన్ రోడ్, సౌందర్య బ్యాక్ సైడ్, కలెక్టర్ ఆఫీస్ రోడ్, ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్ నుంచి రాయగడ రోడ్, నారాయణ స్కూల్ వరకు, కొత్తవలస, పార్వతీపురం మున్సిపాలిటీ మొత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్ర 4 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. పురప్రజలు సహకరించాలని కోరారు.

సాలూరులో...

సాలూరు: పట్టణంలో తాగునీటి సరఫరాకు గురువారం అంతరాయం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ ఓ ప్రకటనలో తెలిపారు.వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో, నీరు పంపింగ్ చేసే నది వద్ద ఎగువ ప్రాంతం నుంచి బురద నీరు వస్తోందన్నారు. కావున గురువారం తాగు నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని, ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

అక్టోబర్ 5 నుంచి అయ్యప్ప ఉచిత సన్నిధానం

పార్వతీపురం టౌన్: అక్టోబర్ 5 నుంచి అయ్యప్ప స్వామి ఉచిత సన్నిధానం ప్రారంభిస్తున్నట్లు శ్రీ విద్యా సర్వమంగళపీఠ వ్యవస్థాపకుడు మురుపాక కాళిదాసు యాజీ తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక దుర్గ చెట్టు ఆవరణలో సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడుతూ అక్టోబర్ ఐదు నుంచి డిసెంబర్ ఒకటవ తేదీ వరకు అయ్యప్ప స్వాములకు ఉచిత భిక్ష, మందిరంలో మాల వేసుకునే స్వాములకు ఉచిత పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఏటా ఈ కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ అవకాశాన్ని అయ్యప్ప దీక్షధారులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చిట్టగెడ్డ కాజ్‌వేకు కోత

- ఏటా వర్షాకాలంలో ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు
- కాజ్‌వే మధ్యలో గోతులతో రైతుల ఆవేదన
- 15గ్రామాల ప్రజల రాకపోకలకు తప్పని ఇబ్బందులు



కాజ్‌వే మధ్యలో ఏర్పడిన గొయ్యి



ప్రమాదకరంగా ప్రయాణం సాగిస్తున్న వాహన చోదకులు

మక్కువ: ఆ కాజ్‌వేపై నుంచి నిత్యం విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు తమ పనులపై ప్రయాణిస్తుంటారు. రైతులు సాగుచేసిన ఆయిల్‌పామ్ గెలలను రైతులు కాజ్‌వే పై నుంచి వాహనాలపై సమీపంలో ఉన్న పామాయిల్ కాటాకు తీసుకురావాల్సి ఉంది. కాజ్‌వే మరమ్మతుల బారిన పడి ఏళ్లు గడుస్తున్నా, అధికారులు, పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదు. వర్షం కురిస్తే, ఎగువనున్న కొండలనుంచి వరదనీరు చిట్టగెడ్డ కాజ్‌వేపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు అవకాశంలేకుండా పోతోంది. మండలంలోని మార్కొండపుట్టి గ్రామం సమీపంలోని చిట్టగెడ్డపై గతంలో నిర్మించిన కాజ్‌వే శిథిలావస్థకు చేరుకుంది. వర్షాకాలంలో చిట్టగెడ్డ ద్వారా ప్రవహించే వరదనీరు కాజ్‌వేపై నుంచే ప్రవహిస్తుంటుంది. నిత్యం కాజ్‌వేపై నుంచి కాపుగైశీల, పెదగైశీల, పాతగైశీల, కేంద్రుకగైశీల, కాకువానివలస, నంద, తుండ పంచాయతీల పరిధిలోని పలు గ్రామాల ప్రజలు కాజ్‌వే దాటి ప్రయాణాలు సాగించాల్సి ఉంది. వర్షాకాలంలో కాజ్‌వేపై నుంచి నీరు ఉధృతంగా ప్రవహించడంతో, గంటలకొద్దీ కాజ్‌వే ఒడ్డున వరద ఉధృతి తగ్గే వరకు వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడతోంది. మరికొన్ని గ్రామాలకు చెందిన ప్రజలు సుదూర గ్రామాలమీదుగా వారి గమ్యస్థానాలుకు చేరుకోవాల్సి వస్తోంది. రాత్రివేళ అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు.

కాజ్‌వే మధ్యలో గొయ్యి

మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి, చిట్టగెడ్డ కాజ్‌వేపై నుంచి వరదనీరు ప్రవహించడంతో, కాజ్‌వే మధ్యలో పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. దీంతో ఫోర్‌వీలర్లు రాకపోకలు సాగించేందుకు అవకాశం లేకుండా పోయింది. గతంలో పలుమార్లు కాజ్‌వే మరమ్మతుల బారిన పడితే రైతులు స్వచ్ఛందంగా మరమ్మతులు చేసుకున్నారే తప్ప, అధికారులు, పాలకులు స్పందించి, శాశ్వత పరిష్కారం చూపలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి చిట్టగెడ్డపై కాజ్‌వే నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని సుమారు 15గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

జంఝావతి పనులు జరగాలి

- జంఝావతి సాధన సమితి డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న జంఝావతి సాధన సమితి ప్రతినిధులు వంగల దాలినాయుడు, తదితరులు

పార్వతీపురంటౌన్: జంఝావతి ప్రాజెక్టుపై ప్రకటనలు కాదు పనులు జరగాలని జంఝావతి సాధన సమితి ప్రతినిధులు వంగల దాలినాయుడు, తీళ్ల గౌరీ శంకరరావు, బలగ శంకరరావు తదితరులు కోరారు. ఈ మేరకు బుధవారం పార్వతీపురంలో వారు విలేకరులతో మాట్లాడుతూ గత 50 ఏళ్లుగా పాలకులు, అధికారులు జంఝావతి ప్రాజెక్టును ప్రకటనలకే పరిమితం చేస్తూ మోసం చేస్తున్నారని ఆరోపించారు. గత అర్ధ శతాబ్దంగా ప్రకటనలు విని ప్రజలు విసుగెత్తిపోయారన్నారు. జంఝావతి ప్రాజెక్టు పూర్తి కాకపోవడంతో ఈ ప్రాంతం వెనుకబడి ఉందని, ప్రాజెక్టు పూర్తి కాక, వర్షాలు సకాలంలో కురవక, వ్యవసాయం లాభాదాయకంగా లేకపోవడంతో జంఝావతి ఆయకట్టు ప్రాంతాలకు చెందిన పలువురు రైతులు పెద్దపెద్ద పట్టణాలు హైదరాబాద్, చెన్నై విజయవాడ, విశాఖ తదితర ప్రాంతాలకు వలసపోయి కూలీలుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. వేసవిలోనే జంఝావతి కాలువల్లో పూడిక తీతలు, జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని స్వాక్షాత్తు కలెక్టర్ నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కోరినప్పటికీ ఫలితం అంతంత మాత్రమే అన్నారు.

జాబ్ మేళాలో 77 మంది ఎంపిక



ఎంపికైన అభ్యర్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్ చంద్ర

పార్వతీపురంటౌన్: నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పార్వతీపురం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి పార్వతీపురంలోని బైపాస్ రోడ్‌లో గల శ్రీ సాయి రామ్ డిగ్రీ కాలేజీఆవరణంలో బుధవారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ మెగా జాబ్ మేళాకు 10 కంపెనీ ప్రతినిధులు, జాబ్ డ్రైవ్‌కు 210 మంది హాజరు కాగా, అందులో 77 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందారు. ఈ జాబ్ మేళాకు ముఖ్య అతిథిగా స్థానిక శాసన సభ్యులు బోనెల విజయచంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువతీ యువకులు కోసం మరిన్ని జాబ్ మేళాలు నిర్వహించనుందని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శ్రీ సాయి రామ్ డిగ్రీ కాలేజీ కరెస్పాండెంట్ రెడ్డి శ్రీనివాసరావు, అదనపు నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కంచిబాబు, ప్లేస్‌మెంట్ అధికారి ఎస్.మనోజ్ కుమార్, ఇతర ప్రజా ప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వరిచేలకు నీటి ముంపు

- రైతుల్లో మొదలైన ఆందోళన
- వీఆర్ఎస్ కాలువ ద్వారా వస్తున్ననీరే కారణం



రామవరం-అంటిపేట గ్రామాలమధ్య నీటమునిగిన వరిచేను



కాశీపేటలో చెరువును తలపించిన వరిచేను మడులు



సాయిబాబా ఆలయం వద్ద నీటమునిగిన వరిచేను

సీతానగరం: మండలంలోని ఎగువప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు, వెంగళరాయ సాగర్ ప్రాజెక్ట్ కాలువ నుంచి వెలువడుతున్న నీరు వెరసి ఆరు గ్రామాలకు చెందిన వరిచేను పొలాలు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ మేరకు వెంగళరాయ(వీఆర్ఎస్) సాగర్ ప్రాజెక్ట్ పరిధిలో ఉన్న 18ఎల్,19 ఎల్ కాలువల ద్వారా వస్తున్న నీటితో చెరువులు నిండిపోయిన అనంతరం రామవరం, రెడ్డివానివలస, కాశీపేట, అంటిపేట, పణుకుపేట, అనంతరాయుడుపేట గ్రామాల రైతుల పొలాల్లోకి నీరు చేరడంతో ఏపుగా పెరిగిన వరిపంటకు నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోతున్నారు. నీటి ముంపునకు గురైన పొల్లాలను పరిశీలించి ప్రభుత్వం తక్షణమే ఉన్ననీరు మళ్లించే చర్యలు చేపట్టాలని, కాలువ లీకులను నివారించడానికి చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

పంటల్లో చీడపీడల విషయంలో అప్రమత్తం



రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయ అధికారులు

సాలూరు రూరల్: పంటల్లో చీడపీడల విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారి కె.శిరీష అన్నారు. ఈ మేరకు బుధవారం ఆమె మండలంలోని తోణాం పంచాయతీ గుడ్డంగానివలస, ముంగివాని వలస గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. పంటల్లో యూరియా ఎక్కువగా వాడకూడదని దీనివల్ల చీడపీడలు సోకే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖాధికారి ప్రత్యూష, రస్తాకుంటుబాయి శాస్త్రవేత్తలు అమృతవీణ, ఎ శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

ప్రత్యేక వసతి గృహాలు, మౌలిక సదుపాయాలు కల్పించండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

పార్వతీపురం రూరల్: జిల్లాలో బీసీ విద్యార్థులకు వసతి గృహాలు, పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి. ప్రత్యేక వసతి గృహాలు ఏర్పాటు చేయాలి. సివిల్ సర్వీసెస్ వంటి ఉన్నత పరీక్షలకు కోచింగ్‌లను ప్రారంభించాలి. జిలాలో జ్యోతిరావు పూలే విగ్రహం ఏర్పాటు చేయాలి. తదితర అంశాలతో కూడిన వినతిపత్రాన్ని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావులు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్‌కు విన్నవించారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసి వినతిత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్పందిస్తూ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తామని, జిల్లా స్థాయిలో తమ పరిధిలో అవసరమైన చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కల్పించాలి



చట్టం గురించి వివరిస్తున్న న్యాయవాది రవికుమార్

పార్వతీపురం: వయోవృద్ధులు, తల్లి దండ్రుల పోషణ, సంక్షేమ చట్టాలను పక్కాగా అమలు చేయాలని హెరిటేజ్ ఫౌండేషన్ న్యాయవాది రవికుమార్ జిల్లా అధికారులను కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆర్ఆర్‌టీసీ, జిల్లా దివ్యాంగుల సంక్షేమ ఆధ్వర్యంలో ఎండబ్ల్యూపీఎస్‌సీ-2007 చట్టంపై ఒక రోజు ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండబ్ల్యూపీఎస్‌సీ-2007 చట్టం వృద్ధుల జీవితం, ఆస్తి రక్షణ కోసం సరళమైన, వేగవంతమైన, చురుకైన యంత్రాంగాన్ని అందిస్తుందన్నారు. తల్లిదండ్రుల సంక్షేమం కోసం రూపొందించిన ఈ చట్టం పిల్లలు, వారసులకు బాధ్యతను గుర్తుచేస్తుందన్నారు. తల్లిదండ్రుల పట్ల నిర్లక్ష్యం వహించినా, ఉల్లంఘించినా ఈ చట్టంద్వారా పిల్లలపై, వారసులపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుడు ఎల్ఎన్‌వీ శ్రీధరరావు, ఐఆర్‌సీఎస్ చైర్మన్ ఎం.శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.